# కన్నులపండువు నవ్వుల కడపరాయుడు

కె. శ్రీనివాసులుశెట్టి, ఎం. ఏ.,
ఆంధ్రోపన్యాసకులు

రాయలసీమలో కడపకొక విశిష్ట స్థానమున్నది. కడప ప్రాచీనచరిత్ర ప్రత్యేక ముగ పరిశీలింపదగినది. నాటి మత, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయరంగములలో ఒక వెలుగు వెలిగిన 'కడప' నేడు అజ్ఞాతముగ నిలిచిపోయినది. పూర్వమీసీమను మూడు విభాగములుగ చేసిరి — గండికోటసీమ, సిద్ధవటముసీమ, ఉదయగిరిసీమ. ఈ మూడు కోటలు చారిత్రకముగ సుప్రసిద్ధములు. మహారాజుల రాజనీతిని స్థానవెట్టిన చోటులివి-ఎన్నో భీషణ సంగ్రామములకు రంగస్థలములివి-ఎందరో సార్వభౌములు, మహారాజులు, మండలాధిపతులు, నాయకులు, నవాబులు, రాజకీయ చదరంగమున ఎత్తులకు పైయెత్తులెత్తిన స్థలములివి. భిన్నవిభిన్న మతసంస్కృతులు పెరిగి విరిగిన ప్రదేశములివి. ఆ పాడుపడిన కోట గోడలను చూచి — కూలిపోయిన దేవాలయములను గాంచి — ఆ శిధిలములు మూగగొంతుకలతోపాడు విషాదగీతికలను విని కంట తడిపెట్టని యాత్రికుడుండడు.

కడపనగరము సముద్రమట్టమునకు 433 అ. ఎత్తున గలదు. దీనిని పదునారవ శతాబ్దమున నేక్నామ్‌ఖాన్ అను నవాబు నిర్మించి "నేక్నామాబాద్" అని పేరు పెట్టెను. ఆ పేరు వ్యవహారమున ఎంతయో కాలము నిలువలేదు. నేడు "పాత కడప" యనునదే ప్రాచీనమైనది. అక్కడ వేంకటేశ్వరుని దేవాలయమున్నది. స్వామి సన్నిధిని "దేవునికడప" యనియు వ్యవహరింతురు. "ఖాన్" గారి క్రొత్త యూరికి కూడ పాతపేరే సార్థకమైనది. "కడప" యనియే రూఢి యేర్పడినది. పూర్వము తిరుమలకు పోవు యాత్రికులకు మార్గము కడప మీదుగనే. 'కడప' దాటియే పూర్వము భక్తులు 'కొండ' నెక్కెడివారు. కడపనుండి పాలకొండల ద్వార తిరుమలకొక మార్గముగలదు. మార్గమధ్యమున అచ్చటచ్చట నిర్మింపబడిన

"మండపములు"[1] యాత్రికుల విశ్రామార్థమే. కడప సరిహద్దులలో 'కోతులకుంట వంక' వద్ద యాత్రికుల కొఱకు "చలివెందురకు" గాను నంద్యాల అవుభళేశ్వరదేవ మహారాజు సూరప అవుభళేశ్వరునకు కొంత భూమిని ఇచ్చినట్లు తెలియుచున్నది.[2] కడప తిరుమలల సంబంధ మనూచానము. తిరుమల క్షేత్రమునకు "కడప" అయిన దీనిని 'కడప' యని వ్యవహరించుటలో సామంజస్యము లేకపోలేదు. పూర్వము కృపాచార్యులవారిచ్చోట నివసించుటచే-పారంపర్యముగ దీనికి కృపావతి యని పేరు కలిగెను. 'కృప' 'కురుప'[3] అయి 'కడప' గ మారియుండునని కొందరి మతము.

క్రీ॥ శ॥ 4-వ శతాబ్దమున చోళులీమండలమును పరిపాలించెడివారు. నాడీ ప్రాంతమునకు "రేనాడ" ని వ్యవహారము. తెలుగున బయల్పడిన తొలి శాసన మీ రేనాటి చోళులదే.[4] తర్వాత బాణులు, రాష్ట్రకూటులు, వైదుంబులు, కాకతీయులు మొదలైన రాజకుటుంబముల పరిపాలనమున కీ భూము లాస్పదమైనట్లు ఆధారము లున్నవి. విద్యానగర ప్రభువుల చేతులలో ఈ సీమ సొగసు రేఖలను దిద్దుకొన్నది. మహమ్మదీయులు, ఇక్కడనే తమ ప్రభుత్వమును గురుత్వమును వెలుగబెట్టిరి. మట్లిరాజు లీ మట్టిలో బంగారమునే పండించిరి. ఆంగ్లేయు లీ నేలను స్థావరముగ చేసికొని జాగ్రత్తగ కాపాడుకొనిరి.

కడప ప్రాచీన చరిత్రను విస్మరించిన ఆంధ్రదేశ చరిత్ర అసంపూర్ణమే యగును. సి. ఎఫ్. బ్రాకెన్ బరీ 'కడపగజిటీర్‌లో' చేసిన పరిశీలన మమోఘమైనది. "Cuddapah's history for many centuries affords but an index to the varying fortunes of neighbouring dynasties. The "choolya state" referred by Hiuen T'sang was the Telugu chola Kingdom occupying most of the black cotton country of this district and perhaps parts of Kurnool and Anantapur."[5]

---

1. వీనిని 'దిడ్డిలాలు' అని వ్యవహరింతురని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారనిరి.
2. చూ. దేవుని కడప దేవాలయములోని శాసనము (శా. శ. 1474.)
3. క్రీ॥ శ॥ 2-వ శతా. చెందిన "Ptolemy of Alexandria geogra phical treatise" లోని 'కురుప' యను ప్రస్తావన దీనితో సంవదించుచున్నది.
4. "ఎరికల్ ముత్తరాజా ధనంజయుడు రేనాడు ఏలుతూ ఉండేవాడు. కామలాపురం తాలూకా కలమళ్ళ గ్రామంలోని చెన్నకేశవాలయం ప్రాంగణంలో ధనంజయుని శాసనం దొరికింది. దీనికాలం క్రీ॥ శ॥ 575 ...." ఆనాటి తెలుగు "....కల్ ము (తు) రాజా ధనంజయున్లు రేనాణ్డు ఏలగా చిఱుమ్బూరి రేవణకాలు (పం) పు చెనూరుకాజా అరిక ా(ఊ) రిణ్డ వారు పంచ (మ) హాపాతక శకు." చూ. అరుద్ర గారి సమగ్ర ఆంధ్ర సాహిత్యము – 1 - పు. 55, 63.
5. Madras Dist. Gazetters vol. 1–Cuddapah by C. F. Brackenbury.

గంపెడు చరిత్రను తన ఒడిలో నింపుకొన్న కడప అజ్ఞాతముగ అగమ్య గోచరముగనే ఉండిపోయినది. ఈ సందర్భమున జె. డి. బి. గ్రిబల్ అమూల్యమైన మాటలు స్మరింపదగినవి. "It is true, as Col. Wilks says, that each stream in this part of the country has its song to sing, and every hill its story to narrate: but unfortunately they do not narrate them, or if they do, do it in language unintelligible to the modern historian. These streams and mountains being the only depositaries of the chronicles of Cuddapah, the early history of the district is and is ever likely to remain, a sealed book"[1]

పెన్నానదీమతల్లి కడప మండలమునకు జీవనాధారము. ఈ భూమిలో ప్రవహించెడి నదీజలాలలో మైసూరు దేశమున ఉద్భవించిన చిత్రావతి, పాపఘ్నియను నదులు కలియుచున్నవి. చిత్తూరు జిల్లాలో పుట్టిన 'బాహుద' కూడ ఈ నదీ ప్రవాహమున సంగమించుచున్నది. పెన్న నీటిని 'గంగాజలముగ' భావించి భక్తి ప్రపత్తులతో ఇక్కడి జనులు సేవింతురు. సాక్షాత్తు పరమశివుని పినాకమునుండి స్రవించిన పవిత్రధారగ ఎంచి పినాకిని యని వ్యవహరింతురు. పినాకినీ పావనోదకములతో పవిత్రమై - ప్రకృతి సహజమైన కొండలతో, కోనలతో తులతూగిన ఈ సీమ నిసర్గరామణీయకమునకు మురిసిన - అగస్త్యుడు, కృపుడు, మృకండుడు, దుర్వాసుడుమొదలైన మహర్షు లెందరో, పురాణకాలమున, పెన్నయొడ్డున ఆశ్రమముల నేర్పరచుకొనిరి. పినాకినీ తటమున సుప్రసిద్ధ శివకేశవాలయము లసంఖ్యాకములున్నవి. కుంభసంభవుడు తన కుటుంబినితో కూడి "జ్యోతి సిద్ధవటనాథు" లను సేవించినారట.[2] మాతృహత్యచే కట్టుకున్న పాపమును పరశురాముడు "అత్తిరాలలో"[3] పోగొట్టుకొనెనట. పరశురామున కిచట గుడిగలదు. అత్యద్భుత వాస్తుశాస్త్ర విన్యాసముతో నిర్మితమై ఉత్తమోత్తమ శిల్పకళావైభవముతో విరాజిల్లు శివకేశవ క్షేత్రము "పుష్పగిరి"[4]. దీనిని వైష్ణవులు, "మధ్యవైకుంఠ" మందురు—

1. Vide. "A Manual of the Cuddapah District" by late Mr. J. D. B. Gribble I. C. S. 1875

2. "ఘటసూతి భూతేశ్వరుని యాజ్ఞం తలమోచి యిల్లాలు తాను కదలి ... జ్యోతి సిద్ధవటనాథు కొల్చి విచ్చేయునపుడు...." (కాశ. మా. ప్ర. అ.)

3. రాజంపేట తాలూకాకు సమీపమునగల సుప్రసిద్ధ శైవక్షేత్రము. శివరాత్రికి పెద్ద తిరునాల జరుగును.

4. దీనికి పేరు వచ్చుటకొక కథ గలదు. కాశిలో గంగలో తండ్రి అస్తికలు కలుపుటకొక బ్రాహ్మణుడు పోవుచు మార్గమధ్యమున ఇచ్చట విశ్రమించెను. పెన్నలో సేదతీరి యొడ్డున 'అస్తికలుంచి' యించుకసేపు కన్నంటించెను. లేచి చూచినంతనే అస్తికలకు బదులుగ పూలరాశి కనిపించెను. నిర్విణ్ణుడైన బ్రాహ్మణుడు 'స్థలమాహాత్మ్యమును' తలచుకొని పూలరాశిని పెన్నపై చల్లెను. ఆ పూలరాశి కొండశిలగ మారిపోయినది. 'పుష్పగిరి' యని వ్యవహార మేర్పడెనని స్థలపురాణము.

అహోబిల తిరుమల క్షేత్రములకు మధ్య ఉండుటచేత: శైవులు 'మధ్యకైలాస' మందురు. వారణాశి చిదంబరాల మధ్య ఉండుటచే కొటోలు. అక్షతదియకేచట గొప్ప తిరునాళ్లుజరుగును. శంకర భగవత్పాదుల "శ్రీచక్ర" మిచట గలదందురు. ఆంధ్రులకు గర్వకారణమైన ఆదిశంకరుల ఏకైక పీఠమిదియే. 'గండి ఆంజనేయుని' మహిమలగణ్యములు. ఇచ్చటనే "మన్రో" తన అవసాన కాలమున "పసిడి తోరణమును" గాంచెనందురు. "కన్యతీర్థము"[1] అగస్త్యాశ్రమము. అగస్త్యుల వారెన్నడో పుటము పెట్టిన ఔషధ మూలికలిట బయల్పడినవందురు. ప్రొద్దుటూరు 'రామేశ్వరాలయము' పురాణ ప్రసిద్ధమేకాదు, అనేక చారిత్రక సంఘటనలకు విషయసూచికగ కూడ నిలిచినది. పదునాల్గవ శతాబ్దమునకు చెందిన తాళ్ళపాక అన్నమయ్య ఈ సీమలో వేల్పులనెందరనో తన సంకీర్తనలలో పేర్కొనెను.[2]

పావన పినాకినీ తటమున వెలసిన దేవునికడప దేవాలయము పురాణ ప్రసిద్ధమైనది. ఇందలి వేంకటేశ్వరుని మూర్తి కృపాచార్యులవారి ప్రతిష్ఠ. తిరుమలను వరాహక్షేత్రమనునట్లు దీనిని హనుమత్ క్షేత్రమందురు. నేటికిని వేంకటేశ్వరుని ధ్రువబేరమునకు వెనుక వైపున హనుమంతుని శిలాప్రతిమను చూడవచ్చును.

తిరుమల వేంకటరమణునకు కడప శ్రీనివాసుడు ప్రతీకము. ఆ అర్చావతారమువలెనే యిదియును భక్తసంరక్షకము. దేవుని కడప దేవాలయచరిత్ర నొకానొకచోట మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులవారిట్లు ప్రస్తావించిరి. "కదంబులీదేవుని కొల్చిరి. పల్లవులీ మూర్తిని సేవించిరి. ఆ రాజులందరును తమసేవ నీస్వామికి చెల్లించినవారే. ప్రాచీన కాలమున దీనికి దేహలి నగరమనిపేరు. పద్నాలుగవ శతాబ్ది మొదటిలో వైష్ణవాచార్యులైన వేదాంతదేశికులు రచించిన "దేహలీశస్తుతి" చాల ప్రసిద్ధమైనది. విజయనగర రాజులు మా స్వామికెంతయో సేవలు చేసిరి. హరిహర రాయలు, బుక్కరాయలు మొదలగు సంగమ వంశస్థులు—ప్రసన్నేశ్వరుని దయకు పాత్రులై యుండిరి. సాళ్వవంశమునకు చెందిన నరసింహరాయలకు ప్రసన్న వేంక

1. ప్రొద్దుటూరు సమీపమున గలదు. ఈ క్షేత్రమును కనుగొని ఉద్ధరించినవారు శ్రీమద్దిరేల గోపయ్యగారు.

2. చూ. శృం. సం. XIX 302, 329 ; 331 ; 333 ; 458, 500 శృం. సం. XVII - 45, 290, 291, 417, 501 ; 563 ; శృం. వం. III - సం. 94, 234, 235, 236, 237, 604.

టేశ్వరుడిలవేలుపు. తుళువ వంశమునకు చెందిన కృష్ణరాయలు వేంకటేశ్వరునకిచ్చిన మణులు - మాన్యము లనేకములున్నవి. అరవీటివంశమువారు సరేసరి. వారు వీర వైష్ణవులు. పెమ్మసాని రాజులు ప్రసన్నవేంకటేశ్వరుని చరణదాసులు. గోలకొండ నవాబులు కూడ ఈ మూర్తి కన్యాయము చేసినట్లు కనపడదు. ఈ దేవాలయమందు పల్లవ శిల్పము లక్కడక్కడ కనిపించుచుండును. విజయనగర శిల్పము సరేసరి. ఆలయ నిర్మాణము పల్లవులతో నారంభమై–విజయనగర సార్వభౌముల పర్యవేక్షణ క్రింద నుండినదని చెప్పవచ్చును."

మహామండలేశ్వర తిమ్మయదేవ మహారాజు (శా. శ. 1396); చిన్న అవుభలరాజు (1476); సదాశివదేవ మహారాయలు (శా. శ. 1476); మహామండలేశ్వర ఓబులరాజు (శా. శ. 1480); నందేల అవుభలేశ్వర దేవ మహారాజు (శా. శ. 1484); కడపరాయని దర్శించి, సేవించి, స్వామి కైంకర్యమున కనేక ధనకనకవస్తువాహనములను సమర్పించినట్లు శాసనములు గలవు.[1]

'కడపరాయని' గురించిన సాహిత్య మెంతయో కాలగర్భమున కలసిపోయినది. తాళ్లపాక అన్నమయ్య జన్మభూమి కడపజిల్లాలోని తాళ్లపాక. తాళ్లపాక కవులు సంగీత సాహిత్యములకు చేసిన సేవ అమూల్యమైనది. వేదాంతదేశికులవారిని వైష్ణవులు విష్ణుఘంటావతారముగ భావించినట్లే అన్నమాచార్యులవారిని నందకాంశ సంభూతులందురు. 'ఈ మహనీయుని రసగుళికలవంటి శృంగారసంకీర్తనలను విని తలయూచి వేంకటేశ్వరుడు శృంగారి అయ్యెనట!, ఈ పరమవైష్ణవ భాగవతోత్తముడు తన జీవిత సర్వస్వమును శ్రీనివాసాంకితము గావించినాడు. తిరుమలలోనే కాపురమై స్వామిసన్నిధిలోనే దినమునకొక సంకీర్తనకు తక్కువలేకుండ రచించి-అంకితమొసర్చి తరించినాడు. వీరి సంకీర్తనలు వేలకొలది రాగిరేకులపై మలచబడినవి. ఇది అపూర్వము. ఆ రాగిరేకులు తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యమున గలవు. ఇప్పటికి సుమారు పదివేల సంకీర్తనములు ముద్రింపబడినవి. అన్నమయ్య సంతతివారు పదకపితాపితామహుని పథమునే అనుసరించి పదములను, వ్రాయుచు, పాడుచు, తిరుమలేశుని పాదసన్నిధిలోనే జీవితములను గడపుచు తిరుమలక్షేత్ర ప్రాశస్త్య ఔన్నత్యములకు తమ సర్వస్వమును ధారవోసిరి. వీరి

1. చూ. దేవునికడప దేవాలయ భిత్తికకు మలచిన శాసనములు.

సంకీర్తనలలోని సంగీత సంప్రదాయ రహస్యములను తెలిసికొను అవకాశము నేడు క్వాచిత్కమైనను, సాహితీ సంప్రదాయములు మాత్రము తెలుగువెలుగులైనవి. జాను తెనుగున, చక్కని నుడికారముతో, దేశీయకవితలో, రచించి ఈ పదకర్తలు ఆంధ్ర సారస్వతమునకమూల్యమైన సేవచేసిరి. రాగిరేకుమీది వచనము అన్నమయ్య అవతారాస్తమయ ములనిట్లు తెలుపుచున్నది.

"స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు 1346 అగు నేటి క్రోధిసంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహనశక వరుషంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 'నిరుధానకు' తిరువేంగళ నాథుని మీదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన (శృంగార - అధ్యాత్మిక) సంకీర్తనలు ॥"

తాళ్లపాక అన్నమయ్య భక్త్యావేశముతో తిరుగని క్షేత్రములేదు. కొలువని దేవుడులేడు. తెనుగు దేశమున వెలసిన సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రములను దర్శించి, అందలి మూర్తులను సేవించినాడు. తిరుమలలో చేరి సుస్థిర భక్తితాత్పర్యములతో తిరువేంగళనాథుని కొలిచి తన జీవితమంతయు స్వామికి నైవేద్యమొనర్చినాడు. తాను సంచరించిన పుణ్యప్రదేశములను, తానుసేవించిన వేల్పులను—తిరుమల శ్రీనివాసునితో—అభేదమును పాటించి ఆనంద పారవశ్యముతో సంకీర్తన చేసినాడు. రసాత్మకమైన ఆ అనుభూతి శృంగార సంకీర్తనలుగను-భక్త్యాత్మకమైన ఆ అవస్థ—ఆధ్యాత్మిక సంకీర్తనలుగను విలసిల్లినవి. వీరి శృంగార సంకీర్తనలు యతిని విటుని చేయగలవు. వీరి ఆధ్యాత్మిక సంకీర్తనలు విటుని యతిని చేయగలవు.

అన్నమయ్య 'కడపరాయని' శృంగారరాయనిగ తీర్చిదిద్దినాడు.[1] కడప రాయని లీలలను అత్యద్భుతముగ వర్ణించును; శ్రీకృష్ణలీలలను స్మృతికి తెచ్చును. ఈ పదములలో కానవచ్చునది అతివేలమైన 'గోపికాప్రణయభక్తి'. కప్పురపు నవ్వుల

1. 'కడపరాయ' ముద్రాంకితములైనవి, సుమారు పదమూడు సంకీర్తన లిప్పటిపరకు నాకంట పడిన వాని నిక్కడ ఉదహరించితిని. చూ: తి. తి. దేవస్థానము. శృం. సం. XIX - 302, 458, 500; శృం. సం. III - 234, 235, 236, 604: శృం. సం. XVII - 45, 290, 291, 417, 501, 563.

కడపరాయని, మొలకనవ్వులతో మ్రొక్కి, గరిడిసాముఱతుల నేలిన శృంగార రసాధి నాయికగ అన్నమయ్య తాదాత్మ్యము ననుభవించును. అన్యకాంతా సంగమము నొల్లని ఈర్ష్యాకషాయిత వలె ముగ్ధమోహనత్వముతో ముసిసిపోవును. కడపరాయడు, జాజులకొప్పు వీడిపోవునట్లు పానుపుపై భామతో సరసములాడెను. కిన్నెరవాణి చన్నులపై కిన్నెరమోపి వాయించి నిట్టూర్చెను. ఇట్లు పంతము చెల్లించుకొన్న 'రాయని' "చాలదాయింక" యని ఒకచో, మేలమాడును, మఱొకచో 'ఎంత పిలిచినరా వనుమానమేల కడపరాయ" అని విరహిణివలె వాపోవును.

పదకవితాపితామహుని 'కడపరాయడు' జగదేక సుందరుడు. కన్నెలు తమ జవ్వనమునే వానికి కప్పముగ చెల్లించినారు. వలచి వలపించుకొన్న కన్నె జాణతన మీ సంకీర్తనములలో కడు హృద్యముగ వర్ణింపబడినది.

శంకరాభరణం

కప్పురమందుకొంటిఁ గడపరాయ నీకుఁ
గప్పము మాజవ్వనము కడపరాయ ॥ పల్లవి ॥

కన్నుల మొక్కేనోయి కడపరాయ నా
కన్నెచన్నులేలంటేవు కడపరాయ
కన్నవారెల్లా నవ్వేరు కడపరాయ నాతో
నన్నలేల నేసేవు సారెఁ గడపరాయ ॥ కప్పు ॥

కలఁగంటిఁ గదవోయి కడపరాయ యికఁ
గలఁచకు మాసిగ్గు కడపరాయ
కలువల వేసేవేల కడపరాయ నీకు
మొలకనవ్వులతోడ మొక్కేఁ గడపరాయ ॥ కప్పు ॥

కరుణించి నన్నేలితి కడపరాయ నీ
గరిమలెల్లాఁగంటి కడపరాయ
గరిడిసాముఱతులఁ గడపరాయ నీకు
యిరవు శ్రీవేంకటాద్రి యిష్టే కడపరాయ ॥ కప్పు ॥ 1

## సాళంగనాట

కాదనకు నామాట కడపరాయ-నీకు
గాదెఁటోసే వలపులు కడపరాయ ॥ పల్లవి ॥

కప్పురమియ్యగరాదా కడపరాయా-నీకుఁ
గప్పితి నాపయ్యెదెల్లఁ గడపరాయ
కప్పుమివే కుచములు కడపరాయా-వో
కప్పుమొయిలు మేనిచాయ కడపలాయ ॥ కాద ॥

కందువకు రారాదా కడపరాయా-ముందే
గందమిచ్చినవాఁడవు కడపరాయ
కందము నీమాటలికఁ గడపరాయా-వో
కందర్పగురుఁడ మొక్కేఁ గడపరాయ ॥ కాద ॥

కలిసితివిటునన్నుఁ గడపరాయా-నా
కలనేఁడు నిజమాయఁ గడపరాయ
కలదాననే నీకుఁ గడపరాయా-వో
కలికి శ్రీవేంకటాద్రి కడపరాయా ॥ కాద ॥ 2

## శంకరాభరణం

కానీవయ్య అందుకేమి కడపరాయ-నేము
కానమా నీచేతలెల్లా కడపరాయా ॥ పల్లవి ॥

కప్పురపునవ్వుల కడపరాయ-నాకు
గప్పువోయి పచ్చడము కడపరాయా
కప్పులుదేరీ నీమోవిఁ గడపరాయ-యివి
కప్పముగా నెవ్వతిచ్చెఁ గడపరాయ ॥ కానీ ॥

గరిగరనివాఁడవు కడపరాయ-నాకుఁ
గరఁగి వలవవోయి కడపరాయా
కపణించి నన్నంటగాఁ గడపరాయ-నిన్ను
గరిసించే దెవ్వతోయి కడపరాయా ॥ కానీ ॥

కలువదంద నీకదె కడపరాయ-నన్నుఁ
గలిసితి వింతలోనే కడపరాయా
కలికి శ్రీవేంకటాద్రి కడపరాయ-నీకుఁ
గలదిఁక నెవ్వతోయి కడపరాయా ॥ చాని ॥ 3

కన్నె సోయగమునకు మురిసిన కడపరాయడు చెలువతో చెలిమిచేసి శృంగారము చేసినాడు. నాయికానాయకుల సరసములు ప్రొద్దువోవు వరకు సాగినవి.

## ఆహిరి

జరపులనె ప్రొద్దువోయె చాలదాయింక
సరుసంగడపరాయ చాలదాయింక ॥ పల్లవి ॥

కేరికేరి చెలినీవు కెలకెల నవ్వించగ
సారెకుంజెమట జారె చాలదాయింక
గారవించి యాకె చేత గతలు చెప్పించుకోఁగా
సారపుం బెదవు లెండె చాలదా యింక ॥ జర ॥

సాజపుం బచ్చిమాటలు సతితోడ నాడఁగాను
జాజుకొనంబులకించె చాలదాయింక
తేజమునం బానుపుపై తెగి సరసమాడగా
జాజుల కొప్పెల్లవీడె చాలదాయింక ॥ జర ॥

నిరతింజన్నులపై కిన్నెరవాయించగాను
సరి నిట్టూర్పులు రేగె చాలదాయింక
పరవశమై కూడగా భామను శ్రీవేంకటేశ
సరుగం బంతము చెల్లె చాలదాయింక ॥ జర ॥ 4

కడపరాయడు దక్షిణనాయకుడు. బహుకాంతాలోలుడు. నాయకుని తలచుకొని విరహిణయైన నాయిక తల్లడిల్లిపోయినది. మదనపరవశయై నాథునికై పలవరింప సాగినది.

మాళవిగౌళ

ఏరాయిప్పుడు నాయెదుటఁ గడపరాయ
నారి నేను నిన్నెఱుంగుదు నను నీవెఱుంగుదువు ॥ పల్లవి ॥

పలుకులంబదరకురా కడుంబగటు చెలియనేను
చెలంగి యే పనులు మనసునం గలిగిన చేసిచూపుదువుగాని ॥ ఏరా ॥

తనిసితి నీకతల మఱి తగవుచెప్పనేల
వెనకటివలెనెకద నీబాసలు వింటింగంటి నలనాడె
నగవులంబనిలేదు యింక నాకు నీకుంబోదు
వెగటువాయ నమంగడపరాయ శ్రీవేంకటగిరిపై గూడితివి॥ ఏరా ॥ 5

రామక్రియ

కాంతగలనాడు యేకాంతముల మాట శ్రీ
కాంతుండవు నీవు యిందు కొఱకు నా కాకలేల కడపరాయ ॥కాంత॥

మానవతి నీవు నను మానమునం బెంచితినేడు
పూనినేమెంత పిలిచిన రావనుమానమేల కడపరాయ

మారుండంతలోనె నీకుమారుండయ్యుండి
మారుకొనెంజూడు సారెసారె నెడమాటలేల కడపరాయ
ఆడజెలింజూచి మారాడలేక నీవు
కూడితివి శ్రీవేంకటగిరిపై గోరికమీరం గడపరాయ ॥ కాంత ॥ 6

కాంతకు విరహాగ్నిచే రేగిన కాక కాంతుని ఎంత ఉపాలంభించినను మానలేదు. నాయికలో చెలరేగిన కాక, కోపము, చింత, వగ, తీరు తెరువే లేదని చెలియతో వాపోయినది.

ముఖారి

కాంతునిందప్పకచూచి కన్నులెల్లా యఱ్ఱనాయె
యెంతయినా మానదు కాక యింక నేమినేతునే ॥ పల్లవి ॥

తానిందాకా రానెందుకు దగ్గరి నే వాదుచేసి
పూనియెంత దిద్దినాను పోదు గోపము
ఆనవెట్టి రమణుని యంగము పచ్చి సేసినా
మానదు నాచలమింక మరియేమి సేతునే ॥ కాంతు ॥

సారెంబొంకినందుకు సంగడివారెల్లంజూడ
చేరివాదానంజిమ్మినా చింతవాయదు
కూరిమి నాసతినిట్టె కుచములంగుమ్మినను
తీరదుననెంజేరి విధి నీకేమిసేతునే ॥ కాంతు ॥

ఆకడంబామరాకైన యందుకు నెగడవెట్టి
వాకిటందన్నునాగి నా వగపువోదు
కైకొని శ్రీవేంకటాద్రి కడపరాయండుగూడె
వాక్కున నాదక మాన వడినేమిసేతునే ॥ కాంతు ॥ 7

కడపరాయడు మానిసీచిత్తచోరుడు. వీని శృంగారలీలలకు మితిలేదు. స్త్రీ వశీకరణవిద్య వీనికి బాగుగ తెలియును. మాయచేసి మనసు దోచుకొను తెగువరి. ఆయములు సోక మాటలాడగల నేర్పరి. తనసుట్టు మాత్రము బయటపడనీడు. వలచిన యువతితో, ఎవరిముందైనను, అదరు బెదరులేక సయ్యాటలాడును. ఈ రసికునితో నాయూరి కన్నెలకు నిద్రాహారములే కరవైనవి. 'ఆడువారి కాలుద్రొక్కను, 'పొరుగువార్లు నవ్వేరన్నను' ఊరుకోడు.

## పాడి

మానవెప్పుడు నీమాయలెల్లాను
నానిన నా ననుపులు నవ్వించీఁగాని ॥ పల్లవి ॥

వాలుక రెప్పలు నీపై వంచి నేనెంత లోఁచినా
తాలిమె చూపుదుగాక అత్తరించేవా
వాలాయించి రాతిగుండెవాఁడ వౌత యెఱుగుదు
పాలుమాలిన నాయాస పాయనీదుగాని ॥ మాన ॥

ఆయములు సోక మాటలాడి యంత కొసరిన
చాయకాదవె కాక సమ్మతించేవా
కాయకపు నీసరిత గట్టిగా నేనెరుగుదు
పాయపు నా వేడుకలు పైకొలిపీఁగాని ॥ మాన ॥

చిమ్ముచు నీకౌగిటిలో చేతలెంత సేసినాను
కుమ్మరించి నాతోను నీగుట్టు చెప్పేవా
కమ్మటి శ్రీవేంకటాద్రి కడపరాయఁడవై
నెమ్మదిఁ గూడితివిదె నిజమాయఁగాని ॥ మాన ॥ ౫

## దేసాళం

సాకిరి మీరే సుండి సుతులాలా
యీకడ నన్నే నేరాలెంచరాకురమ్మా ॥ పల్లవి ॥

వుడివోని తమకాన వొకటొకటాడవచ్చి
తడవము తాఁకము తానేమె వీఁడు
నడుమ నేనేమన్న నానోరె గనమే
వుడుకు సూరుపు తోడ నూరకుండేనమ్మా ॥ సాకిరి ॥

చిత్తిణి గుణముతోడ చేతులు చాఁచగవచ్చి
బత్తిగల వానివలె పైపై వీఁడు
అత్తినేఁ గోపగించితే నందరు నన్నేదూరేరు
కొత్త నివ్వెరగు తోడఁ గూచుండే నమ్మా ॥ సాకిరి ॥

యెవ్వరి ముందరనైన యెమ్మెకే నవ్వగవచ్చి
పవ్వళించాఁబోనీఁడు పదరివీడు
యివ్వలఁ గడపరాయఁడిదె శ్రీవేంకటగిరి
నివ్వటిల్ల నన్నుఁగూడె నెయ్యమైతినమ్మా ॥ సాకిరి ॥ ౬

## మధ్యమావతి

పొదిగి మమ్ము రేఁచక పోపో నీవు
పొచరులాడక నీవు పోపో నీవు ॥ పల్లవి ॥

గద్దరి నీమాటలకు కడమొదలే లేదు
పొద్దువోయ నలసితి పోపో నీవు
అద్దలించి నన్నే నీవు ఆనవెట్ట వచ్చేవు
బుద్ధులంత నేరవు పోపో నీవు ॥ పొదిగి ॥

కడనున్న యాఁడువారి కాలఁదొక్క వచ్చేవు
పొడవులు చూపక పోపో నీవు
విడువిడు నీసుద్ది వింతలా మాకేమి నీవు
పుడుకక్క మమ్మంత పోపో నీవు ॥ పొదిగి ॥

కెరలించకంతమమ్ము కేరి నీగుట్టే చాలు
పొరుగువారు నవ్వేరు పోపో నీవు
గరిమి శ్రీవేంకటాద్రి కడపరాయఁడ నన్ను
పురిగొనఁ గూడితివి పోపో నీవు ॥ పొదిగి ॥ 10

నాయకు డన్యకాంతాసక్తుడైనాడని చెలికత్తెలు దూరుఁ చెప్ప నాయిక కళ వళపడెను. నాయకుడు చెంతచేరినాడు. కాంతుని కౌగిట చేరిన కాంత కోపము వెన్నవలె కరగిపోయినది.

శంకరాభరణం

కానీవే తనవేసాలు కనుగొంటిఁగా
వీనులకు యీసుద్దులు వెరగాయఁగా ॥ పల్లవి ॥

చెప్పరే చెప్పరే వీని చేఁతలు నాకు
అప్పుడే యాపెతో మాటలాడివచ్చెనా
ముప్పిరి నాకిఁక నేటి మొకమోటమే
తప్పని బొంకనివాఁడు తానెందువోయీనే ॥ కానీవే ॥

యెంతకెంత వీనిసుద్దులేల దాఁచేరే
చెంతిగా నాపెను వెంటఁదోడితెచ్చెనా
పంతపుమోసములికఁ బనికిరావె
సంతసమే చేసేఁగాక జగడించేనా ॥ కానీవే ॥

యేమంటిరేమంటిరే యెఱగనేను
చేముట్టి యూపెను నాచేతికిచ్చెనా
కామించి శ్రీవేంకటాద్రి కడపరాయడు నన్ను
గోమునఁగూడె నిదియుఁ గొంతవలెనా ॥ కానీవే ॥ 11

## సామంతం

అటువంటి వాఁడవో అద్దోనీవు
నటన మొకమోటాలు నడపేవుగాక ॥ పల్లవి ॥

తలఁపు లోపల నీకు తగులు గలిగితేను
అలరిరాకుండుదువా అక్కడ నీవు
చలముల నెవ్వతో జాగులఁబెట్టుక నిన్ను
వెలిలోను మఱపించి వెట్టిఁజేసెఁగాకా ॥ అటు ॥

కడుఁ దమకము నీకుఁ గమ్మి పెరరేఁచితేను
అదరినాతో మాటలాడకుందువా
వడి నెవ్వతో నిన్ను వాకట్టు గట్టుకయింత
ముడివెట్టి విడిచి తామొప్పేఁజేసెఁగాకా ॥ అటు ॥

తటుకున నన్నుఁగూడేదయ నీకు లేకుండితే
ఘటన నెదురుకొని కాఁగిలింతువా
యిటువలె శ్రీవేంకటేశ కడపలోన
సటల నెవ్వతో నిన్ను చండిసేసెఁగాకా ॥ అటు ॥ 12

దేవునికడపలో రథసప్తమికి తిరునాళ్లు. ఆబాలగోపాల మీయుత్సవమున తండోపతండములుగ పాల్గొందురు. తిరునాళ సంబరములు, వేడుకలు చిత్రవిచిత్రములుగ నుండును. రసికజనమ్మున కానాడుపండుగ. కోడెగాండ్ర మేలపు మాటలు—కళావతుల విలాస విభ్రమములు-తోలుబొమ్మలాటలు-దాసరిగుంపులు-వారిచేతులలో దివెదారి కోలలు—దొమ్మరాటలు— ఇక్షుకాండముల వీరవిహారములు—ఒక్కటేమిటి—కడప ప్రజల మానసోల్లాసములవి. కడపరాయడు ఉభయనాంచారులతో తేరెక్కి ఊరేగును. ఆరథోత్సవము లోచనోత్సవముగ నుండును. సంకీర్తనాచార్యుడీ

మహోత్సవమున భక్తిపారవశ్యముతో ఎన్నియో పాటలు పాడెను. "కాంతతో శ్రీవేంకటేశ కడపలో తేరెక్కి యింత నన్నుగూడి వీధులేగితివి నీవూ" అని అరమోడ్పుకనులతో ఆ మధురస్మృతులను స్మరించుచు గానముచేసెను.

శంకరాభరణం

ఎవ్వరితో గొడవేల యింకా నీకు
రవ్వగా నీయింటికి రమ్మనేవు నీవూ ॥ పల్లవి ॥

యీ యింతిపై మన్నన నీకేఁటిదో వొక్కమాటలో
నేయరానిపనులైన సేతువు నీవు
మాయసేసి యాపె నీతో మచ్చిక చల్లితేఁజాలు
పాయలేక నిలువున భ్రమతువు నీవూ ॥ ఎవ్వరితో ॥

యెవ్వరైనా నాపెను నేఁడిటు పేరుకొంటేఁజాలు
అవ్వల మూపులు మూసి అవుదువు నీవు
నవ్వులకు నాపెపయి నానలు వెట్టితేఁజాలు
నివ్వెరగుపడి అట్టెనిలుతువు నీవూ ॥ ఎవ్వరితో ॥

యెంతదడవాపె నీయెదుట నుండితేఁ జాలు
రంతులఁ గిందుమీఁదు నరయవు నీవూ
కాంతతో శ్రీవేంకటేశ కడపలోఁ దేరెక్కి
యింతనన్నుఁగూడి వీధులేగితివి నీవూ ॥ ఎవ్వరితో ॥ 13

అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలకు త్యాగయ్య వారసుడు కాగా-శృంగార సంకీర్తనలకు క్షేత్రయ్య వారసుడైనాడు. పదకవితకీ క్షేత్రజ్ఞుడు పదనువెట్టెను. ఈతని జావళులను విన్న 'ఉల్లము ఝల్లు' మనని రసికుడుండడు. కడపరాయని శృంగారము క్షేత్రయ్యనుకూడ మురిపించినది. తన మృదుమధుర శృంగార పదాలలో కడపరాయని నింపినాడు.

కడపవేంకటేశుని యెడబాసిన నాయిక విరహవేదనచే వేడినిట్టూర్పుల నూర్చినది. వలరాజుబాధకు తాళలేక, 'ఎవరు తోడి తెచ్చెదరమ్మా! ఇందువదన! కడప వేంకటేశుడెంత దూరాన నున్నాడో!' యని సఖితో మొరపెట్టుకొనినది.

ఇందుకేమి సేతునమ్మా! యెవరు తోడితెచ్చెదరమ్మా
ఇందువదన! కడపవేంకటేశుడెంత దూరాననున్నాడో ॥ ఇందు ॥

ఎక్కువ మోహమున నన్ను నేవేళఁగౌగిట జేర్చువా
డొక్కడే పవ్వళించియుండ-నోపునటవే?
పక్కలోన వెదకి కానక-ప్రాణేశుడెంత కలవరించెనో
మిక్కిలి విరహవేదన చేతఁ
జక్కని సామికి మేనెంత చిక్కెనో ॥ ఇందు ॥

నెలతరో! నాకెమ్మోవానక-నిమిషమైనఁదాళలేడు
యెలమి నాపొత్తునేగాని భుజియింప నొల్లడు
తెలియనైతి మా యిద్దఱి వలపు-సృష్టిదాకె నమ్మలార
పలరాజు నన్ను బాధించినట్ల నా
చెలువుని నేడెంత వెతలబెట్టెనో ॥ ఇందు ॥

పడతిరో! మువ్వగోపాలుడైన-కడప వేంకటేశునిగూడి
యెడబాయక యుందునని-యెంచుకొంటి
తడయకేనొకటి తలచితే-దైవమొకటి దలచినందుకు
తొడబడి నే తెగువ జేసెదనంటె
తొయ్యలి! వాడేమి చేసుకొనునో ॥ ఇందు ॥

"కడపాధినాయకాష్టకము" నునది ప్రాచీనకవి విరచితమీ వేల్పును గురించి చెప్పినదొకటి గలదు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయమున దీనికి సంబంధించిన ప్రతులు రెండున్నవి. ఒకటి తాళపత్రప్రతి (సం. 132-పత్ర సంఖ్య. 78); మరియొకటి వ్రాతప్రతి (సం. 128.) వ్రాతప్రతి తాళపత్రమునకు ప్రతిగ తోచుచున్నది. వీని పాఠములందు భేదము కానరాలేదు.

శ్రీగిడుగు రామమూర్తి పంతులుగారి వ్యాసముల నొకానొక సందర్భమున పరిశీలించుచుండ ఈ 'కడపాధినాయకాష్టక' ప్రసక్తి కనిపించినది.[1] కడప వేంక

* క్షేత్రయ్య పదములు (శ్రీ విస్సా అప్పారావు)-సం. 48.

1. గిడుగు రామమూర్తి పంతులుగారి సప్తతిమ జన్మదినోత్సవ ప్రచురణము-౩ "వ్యాసావళి" పు. 20.

ఈశుని మీదగల సాహిత్యమును సేకరించు ప్రయత్నముననున్న నాకిది అదృష్ట దర్శనమైనది. పంతులుగారు దీనిని, వ్యావహారిక భాషలో విరచితమైన ప్రాచీన సాహిత్యమును తెలుపు సందర్భమున పేర్కొనిరి. ఇది 'గవర్నమెంటువారి లిఖిత పుస్తక భాండాగారమునందున్నద'ని వారు తెల్పిరి. మిత్రుల సాహాయ్యమున తిరుపతి ప్రాచ్య పరిశోధనాలయమున దీనిని సులువుగనే చూడగల్గితిని. మాతృకాను సారముగ ప్రతిని తయారుచేసితిని. తాళపత్రమునందలి వ్రాతను యథాతథముగనే తెలిపి—దానిక్రింద, పఠనయోగ్యముగ నుండుటకై కొన్ని సౌకర్యముల నొనర్చితిని. లుప్తభాగములను ఎడనెడ నాబుద్ధి కందినంతవరకు పూరించితిని.

'కడపాధినాయకాష్టక' కర్త యెవ్వరో తెలియలేదు. తాళపత్ర వ్రాతప్రతులలో కవిపేరు కనుపించలేదు. కడపదేవుని గురించి ఇంత రసస్ఫూర్తితో కవిత చెప్పిన ఘనుడు ఆ సమీప ప్రాంతములవాడని ఊహించుటలో అసామంజ్యము లేదనుకొందును. ఉపలబ్ధ ఆధారములతో నిర్దుష్టమైన నిర్ణయ మొనర్చుటకు వీలులేదు. పద్యములు మొత్తమెనిమిది. ఆరు మత్తేభవృత్తములు, రెండు శార్దూలములు. ధారాళమైన శయ్యా సౌభాగ్యములతో కవిత జాలువారుచున్నది. వ్యావహారికమైన శైలిలో, శక్తివంతమైనభాషలో, ఇంత చక్కని భావస్ఫూర్తితో కవితను వెలయించిన కవి అసమాన్యుడని చెప్పక తప్పదు.

కడపాధినాయకుడు శృంగారనాయకుడు. ప్రణయిని ప్రియుని విడిచిపోయి నెలమీద పదిప్రొద్దులాయెను. వియోగ మతనికి దుస్సహమైనది. దినమొక యుగముగ గడిపినాడు. మదనుని పుష్పశరహంకారము మితిమీరినది. నాయకుడు విరహాగ్నిచే క్రాగినాడు. వెన్నెలరేలు వెక్కిరించినవి. కోర్కెలు ఘనమైనవి. సంతాపతప్తుడైన నాయకుడు, 'నన్నెడబాయనీకుతగవా' యని దీనునివలె వేడును. 'పంతంబు లింతేటికే' 'నేవల్ నేనెద కౌగిలియ్యగదవే' 'కటాక్షించవే' యని బ్రతిమిలాడును. 'ప్రాణంబులు నిల్పవే, యని కాంత కౌగిలికి మ్రొక్కను.' పుడమిన్నిద్దర మొక్కటై జగములఁ బోషింపుచున్నెప్పుడుఁ గడపందుఁ వసియించి యుందుమ' ని తీరని అనురాగమును - అధికారమును సూచించుచు "కాంతాశిరోరత్నమా" యని స్త్రీలోకమునకే తలమానికము చేసెను. కడపాధినాయకుని అవస్థ-సందేశమును విని ఆ 'లావణ్యవతి' ఆ 'పక్వబింబాధరి' - ఆ 'చిల్కలకొల్కి'- "కాకల్ వృథాశాయక" అతనిని మన్నించియే యుండును.

# * కడపాధినాయకాష్టకము

శుభమస్తు :

కలకంఠి కలహంస చారుగమనా కాంచికలోపోజ్వలా
అలివేణి కుసుమాంగి చంద్రవద....ర్యక్షమధ్యా శుభా
.... .... ... .... దయతో నాపై కటాక్షించవే
.... .... యానె కడపాధినాయకుడనె శ్రీవెంక్కటాధీశునె[1]

మ॥ కలకంఠీ! కలహంసచారుగమనా! కాంచీకలాపోజ్జ్వలా!
అలివేణీ! కుసుమాంగి! చంద్రవద [ నా ! హ ] ర్యక్షమధ్యా! శుభా :
[ నలినాక్షీ! బిగికౌగిలీయ ] దయతో నాపై కటాక్షించవే
[ చెలి ] యా ! నే కడపాధినాయకుడనే శ్రీవేంకటాధీశునే 1

కులుకుంగుబ్బలు నాయురంబ్బు గదియఁ కొపించ్చి నాటించ్చవె
పలు .... .... విఙయు .... . ల్లంగా పలుకవె....త్తబు లింత్తేటికె
అలనాడా....న మాట....ల్ల గదవె ఆమాటనె దప్పనె
చెలియానె కడపాది నాయకుండనె శ్రీవెంక్కటాధీశునె.

మ॥ కులుకుంగుబ్బలు నాయురంబుగదియఁ కోపించి నాటించవే!
పలు [ కున్నా ] ఙము [ చె ] ల్లఁగా పలుకవే! [ పం ] తంబు లింతేటికే:
అలనాడా [ డి ] నమాట [ క ] ల్ల గదవే! ఆమాట నేఁ దప్పనే!
చెలియా! నే కడపాధినాయకుఁడనే: శ్రీవేంకటాధీశునే 2

రావె చిల్కలకొల్కి రూపవతి యోరామా మనోహారిణీ
కోవె కొమ....విడె మంద్దుకొనవె కొక్కెఁల్ ఘనంబాయనె
నివాడఁ నిను నమ్మివుంద్దు[2] గదవె నిక్క....బ్బునె వెట్కతో
తెవల్ తెతెద కౌంగిలియ్య[3] గదవె శ్రీవెంక్కటాధీశునె

---

* \ l . i i Oriental Research Institute- వ్రాతప్రతి, సం. 128; తాళపత్రము సం. 132, పత్ర సంఖ్య - 78.

1. 'వేంకటాధీశునే' అలాక్షణికము. "వేంకటాధీశుఁడనే" అని ఉండవలెను. ఈ ప్రామాణిక పాఠము వలన గణభంగమేర్పడును. కవి బుద్ధిపూర్వకముగనే ఇట్టి ప్రయోగమును ఇతరత్రకూడ చేసి నట్లు తోచును.

2. 'ఉందు' ప్రామాణిక రూపము. 'ఉంద్దు' వ్యావహారికము.

3. 'కౌఁగిలియ్య' వ్యావహారికము.

శా॥ రావే చిల్కలకొల్కి! రూపవతి! యోరామా! మనోహారిణీ!
కోపే కా[మ్మరా!] వీడె మందుకొనవే! కోర్కెల్ ఘనంబాయెనే!
నీవాఁడఁ నిను నమ్మియుందు గదవే! నిక్క[ంబు] నే వేడ్కతో
సేవల్ సేసెద కౌఁగిలీయ గదవే! శ్రీవేంకటాధీశునే. 3

వో లావణ్యవతి సరొజవదనా వొపక్వ బింబ్బాధరి
చాలఁ వెన్నెల మించ్చికాయ నిపుడుఁ సంత్తాపముల్ మించ్చెనె
బాలా మ్రొకెద కౌంగిలియ్య[1] గదవె ప్రాణంబ్బులుఁ న్నిల్పవె
శ్రీలక్ష్మిపతినె ధరాధిపుండనె శ్రీవెంక్కటాధిశునె

శా॥ ఓ లావణ్యవతీ! సరోజవదనా! ఓ పక్వబింబాధరీ!
చాలఁ వెన్నెల మించికాయ నిపుడుఁ సంతాపముల్ మించెనే!
బాలా! మ్రొక్కెద కౌగిలీయగదవే! ప్రాణంబులున్నిల్పవే!
శ్రీలక్ష్మిపతినే! ధరాధిపుఁడనే! శ్రీవేంకటాధీశునే. 4

అదయుండ్డై మదనుండ్డు పుష్పశరముఁ హంక్కారతఁ పూంచ్చి నా
యద[2]నంట్టఁ వడి నెయనెయ విరహంబె ...త్తైన యచ్చిల్లెఁ నే
అదనా నంన్నెడబాయ నికు తగవా హారి జగన్మోహిని
మదిరాక్షి! విను వెంక్కటెశ్వరుండనె మన్నించ్చి నఁ గూడవె

మ॥ అదయుండ్డై మదనుండు పుష్పశరముఁ హంకారతఁ పూంచి నా
యెదనంటఁ వడినేయునేయ విరహంబె[ం]త్తైన [హెచ్చిల్లెనే!]
అదనా నన్నెడబాయ నీకు తగవా హరీ! జగన్మోహినీ!
మదిరాక్షీ! విను వేంకటేశ్వరుఁడనే! మన్నించి నఁ గూడవే! 5

యెలనాగా నినుబాశి ఉన్నదినముఁ యెదౌగదె బాలకి
నెలమీదఁ పదిప్రొద్దులాయ[3] నిపుడుఁ నెనెల్లు వెగింత్తునె
కలనైనఁ నిను బాయకుండ్దగ....వె... కల్ వృధాశాయకె
చెలియానె కడపాదినాయకుడనె శ్రీవెంక్కటాధిశునె

---

1. 'కౌఁగిలియ్య' వ్యావహారికము.

2. 'యద' అని కవి బుద్ధిపూర్వకముగ ప్రయోగించెనని చెప్పుటకు వీలులేదు. యతిమైత్రి 'ఎ (ఎ+ఎ) తోడనే యనుటస్పష్టము. ఇది వ్రాయవగాని తప్పే.

3. 'ప్రొద్దులాయె' లాక్షణికము. 'ప్రొద్దులాయ' వ్యావహారికము.

మ॥ ఎంనాగా: నినుబాసియున్న దినముఁ యేదొగదే బాలకీ!
నెలమీదఁ పదిప్రొద్దులాయె[1] నిపుడుఁ నేనెట్లు వేగింతునే!
కలనైనఁ నినుబాయకుం[దు]గ[ద]వే! [నాకా]కల్ వృధా [నే] యకే![1]
చెలియా! నే కడపాధినాయకుఁడనే శ్రీవేంకటాధీశునే. 6

నిను ని చక్కెర[2] తెనె మోవి తనియఁ వెవెగ నాకియ్యవె[3]
నను ని కౌంగిట చెచ్చిఁ ముద్దులిడవె నాకొక్కెఁ లిడెచ్చఁవె
నను చెపట్టిన పేరు గిత్తిఁ గలదె నాపై కటాక్షించ్చవె
వనితానె కడపాది నాయకుండనె శ్రీవెంక్కటాధిశునె.[4]

మ॥ [వి]ను నీ చక్కెర తేనె మోవి తనియఁ వేవేగ నాకీయవే!
నను నీ కౌఁగిట చేర్చి ముద్దులిడవే! నాకోర్కెలీదేర్చవే!
నను చేపట్టిన పేరుఁ గీర్తిగలదే! నాపై కటాక్షించవే!
వనితా! నే కడపాధినాయకుఁడనే! శ్రీవేంకటాధీశునే 7

వడదెరఁ విడెమిచ్చి మచ్చికలరఁ వామాక్షిని మెడలొ
కదువెడ్కఁ మరుకెలి కూడితివి గా పౌఖ్యంబ్బు నాక్బ్బెనె
పుడమిఁ యిద్దరమొక్కటై జగములఁ పోషింప్పచుఁ యెప్పుడుఁ
కడపందుఁ వసియించ్చి[5] యుండ్డుము[6] సదాకాంత్తా శిరొరత్నమా.

మ॥ వడదేరఁ విడెమిచ్చి మచ్చికలరఁ వామాక్షి! నీ మేడలో
కడువేడ్కఁ మరుకేళి కూడితివిగా సౌఖ్యంబు నాకబ్బెనే!
పుడమి [న్ని]ద్దరమొక్కటై జగములఁ పోషింపుచు [న్నె]ప్పుడుఁ
కడపందుఁ వసియించి యుందు ము సదా కాంతాశిరోరత్నమా. 8

1. 'చే (నే) యకే' సాధువు; 'శాయకే' వ్యావహారికము. ఈ ప్రయోగము గ్రంథవిలేఖువిది కూడ కావచ్చును.

2. 'చక్కెర' వ్యవహారరూపము. 'చెక్కెర' ప్రామాణికము.

3. 'నాకియ్యవే' వ్యావహారికము.

4. ఈ పాదమున యతి భంగము గలదు. చతుర్థపాద ప్రథమాక్షరము 'వ' కు పదునాల్గవ యక్షరము 'శ్రీ' తో యతిమైత్రి పొసగదు.

5. "కడపందుఁ" కడప అందుఁ సంధి అలాక్షణికము. 'కడపయందుఁ' అనునది లాక్షణికము, కాని గణభంగమగును.

6. 'యుండ్డుము' వ్యావహారికము.